ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే

రాయికల్: రాయికల్ పట్టణం తో పాటు మండలంలోని 32 గ్రామాల్లో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మల్యాల: మండల కేంద్రంలోని స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానికులు కేక్ కట్ చేసి, వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం స్నేహితుల దినోత్సవం వేడుకలు యువత ఘనంగా నిర్వహించుకున్నారు. కూడళ్ల వద్ద కేకులు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేస్తూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు, చిన్నారులు సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఫ్రెండ్స్‌షిప్ డే బ్యాండ్స్ కట్టుకుని సందడి చేశారు. కార్యక్రమంలో మహిళలు,చిన్నారులు, యువకులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో వాటర్ ట్యాంకు కాలనీలో మహిళలు ఆదివారం ఫ్రెండ్‌షిప్ డేను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలోని అన్ని ఇళ్లలోని మహిళలు ఒకరికొకరూ గాజులు వేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


చిట్టాపూర్‌లో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు


చిన్నమెట్‌పల్లిలో గాజులతో మహిళల సంబరాలు


రాయికల్‌లో కేక్ కట్ చేస్తున్న మహిళలు

ప్రశాంత కోరుట్లలో విద్వేషాలా..?

కోరుట్ల రూరల్: ప్రశాంతంగా ఉండే కోరుట్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు విద్వేషాలు సృష్టిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. మండలంలోని అయిలాపూర్ రైతు వేదికలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ ఆదివారం మాట్లాడారు. జువ్వాడి కృష్ణారావు ఏ హోదాలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌పై ఆరోపణలు చేస్తున్నారని నిలదీశారు. గత నాలుగైదు పర్యాయాలు కోరుట్ల నియోజకవర్గ ఓటర్లు జువ్వాడి బ్రదర్స్‌ను తిరస్కరించారని , రాబోయే రోజుల్లో డీ లిమిటేషన్‌లో ఎలాగు కోరుట్లను వదిలేయాల్సి వస్తుందని, ప్రశాంతంగా ఉన్న ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. కృష్ణారావుకు పార్టీలో గాని, ప్రజా ప్రతినిధిగా గాని ఏ హోదా లేక పోయినా నియోజకవర్గంలో తిరుగుతూ వారానికి ఒకసారి ప్రెస్ మీట్ పెట్టి ఎమ్మెల్యేను విమర్శించటమే పనిగా పెట్టుకున్నాడన్నారు.

ప్రెస్‌మీట్ అడ్డుకున్న పోలీసులు..

బీఆర్‌ఎస్ నాయకులు అయిలాపూర్ రైతు వేదికలో ప్రెస్ మీట్ పెట్టడాన్ని పోలీసులు అడ్డుకున్నారు. రైతు వేదికలో కాకుండా మరోచోట నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. అయిలాపూర్ మేజర్ గ్రామం కావటంతో ఇక్కడ నిర్వహిస్తున్నామని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. ప్రెస్ మీట్ చివరిలో నాయకులను అక్కడి నుంచి పోలీసులు ఖాళీ చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గంజాయి సాగు చేసినా.. విక్రయించినా చర్యలు


గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

జగిత్యాలక్రైం: గంజాయి సాగు చేసినా, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని జగిత్యాల సీసీఎస్ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లె గ్రామానికి చెందిన మోత్కు రాజు 4 గంజాయి మొక్కలను సాగు చేయగా, సిసిఎస్ పోలీసులు గుర్తించి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. వాటి బరువు 241 గ్రాములు ఉంటుందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, జిల్లాలో అన్ని రకాల అక్రమ కార్యాకాలాపాలపై చర్యలు తీసుకుంటూ నిరంతరం నిఘా పెట్టి తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దాడుల్లో రూరల్ ఎస్సై సదాకర్, మండల వ్యవసాయాధికారి తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం వేంపేట శివారులో పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు దాడులు జరిపారు. ఆదివారం గ్రామ శివారులోని ఓ ప్రాంతంలో దాడులు జరిపిన సీసీఎస్ పోలీసులు, నలుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,350 నగదు స్వాధీనం చేసుకుని, 4 సెల్‌ఫోన్‌లు సీజ్ చేశారు. పట్టుబడ్డ వ్యక్తులను మెట్‌పల్లి పోలీసులకు అప్పగించగా నలుగురిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

సారంగాపూర్: మండలంలోని పోచంపేట గ్రామానికి చెందిన శీలం మల్లేశం (44) రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మల్లేశం జూలై 21న జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా గుల్లపేట-కోనాపూర్‌ల మధ్య ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో మల్లేశం తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం కరీంనగర్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు.

మృతుడి బంధువుల ఆందోళన

మండలంలోని పోచంపేట గ్రామానికి చెందిన శీలం మల్లేశం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందగా, మృతికి కారకులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మల్లేశం బంధువులు ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్సై గీత, పోలీసులు అక్కడికి చేరుకుని కేసు నమోదు చేశామని, నిందితులపై చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

5న వినియోగదారుల పరిష్కార వేదిక

మల్యాల: మండల కేంద్రంలోని 33/11కేవీ ఉప కేంద్రంలో ఈ నెల 5న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఏడీఈ మహేందర్ తెలిపారు. సీజీఆర్‌ఎఫ్ లోకల్ కోర్టు చైర్మన్ నారాయణ, సాంకేతిక సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బడుగులకు రాజ్యాధికారం అంబేడ్కర్ ఘనతే

జగిత్యాలటౌన్: బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించి చట్టసభలకు వెళ్లేలా ప్రోత్సహించి, రాజ్యాంగ రక్షణ కల్పించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కిందని చీటి శ్రీనివాస్‌రావు అన్నారు. ప్రతి ఆదివారం అంబేడ్కర్ స్మరణలో భాగంగా ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ప్రెస్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడి సాధించి వాటికి రాజ్యాంగ రక్షణ కల్పించారని గుర్తు చేశారు. రాజ్యాంగ పదవులను రిజర్వేషన్ ద్వారా కేటాయించి అందులో వారే పోటీ చేసి పరిపాలనలో భాగస్వామ్యం అయ్యేలా ప్రోత్సహించిన ఘనత అంబేడ్కర్‌దేనన్నారు. కార్యక్రమంలో డిక్కీ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, ప్రధాన కార్యదర్శి సంపూర్ణచారి, మద్దెల నారాయణ, కాంతారావు, జవ్వాజి శంకర్, అంబేడ్కర్ వాదులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న శ్రీనివాస్‌రావు

బీఆర్‌ఎస్ నాయకులు స్థాయిమరిచి విమర్శిస్తే సహించం

మల్లాపూర్: బీఆర్‌ఎస్ నాయకులు స్థాయి మరిచి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావుని విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మల్లాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతులకు సరిపడా యూరియాను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే విధంగా ఎమ్మెల్యే సంజయ్, బీఆర్‌ఎస్ నాయకులు నిరాధారమైన విమర్శలు, తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యే సంజయ్ చేసిన ఆరోపణలు రుజువు చేయాలని సవాల్ విసిరితే తాను రాకుండా బీఆర్‌ఎస్ నాయకులను పంపించడంతోనే తప్పుడు ఆరోపణలని ప్రజలకు అర్థమైందన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వర్ద సురేష్, నాయకులు మరిపెల్లి మల్లయ్య, కంచిరాజు, పాతకాల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పద్మశాలీ సేవా సంఘం పట్టణ అధ్యక్షుడిగా రాజేశం


పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు

రాయికల్: రాయికల్ పట్టణ పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడిగా బోగ రాజేశం ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలో జరిగిన ఎన్నికల ఫలితాల్లో భోగ రాజేశంకు 429 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి గాజంగి అశోక్ 259 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షుడిగా దాసరి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా కడకుంట్ల నరేష్, కోశాధికారిగా ఆడెపు నర్సయ్య గెలుపొందారు. ఈ సందర్భంగా రాజేశం మాట్లాడుతూ సంఘ పటిష్టత కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల కమిటీ నిర్వాహకులు, పోపా సభ్యులు దాసరి రామస్వామి, ఎలిగేటి రాజ్ కిషోర్, గాజెంగి రాజేశం, సింగని రాందాస్, భూమేశ్వర్, సత్యనారాయణ, అభయ్‌రాజ్, రమేష్, రాం, విజయ్, హరి, నరేష్ ,శ్యాం తదితరులు పాల్గొన్నారు

విశ్వబ్రాహ్మణ నూతన కమిటీ ఎన్నిక

వెల్గటూర్ : ఎండపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన పాలక వర్గాన్ని స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సీపెల్లి శంకర్, ప్రధాన కార్యదర్శిగా నాగసముద్రాల శ్రీనివాస్, కోశాధికారిగా మడుప మనోహర్, ఉపాధ్యక్షుడిగా సింహరాజు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా ఎర్రోజు వెంకటాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సంఘం సభ్యులకు నూతన పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

త్రీఫేజ్ విద్యుత్ సరఫరా మెరుగు పరచండి

సారంగాపూర్: వ్యవసాయానికి అందించే త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను మెరుగు పరచాలని బీర్‌పూర్ మండలం తాళ్ల ధర్మారం గ్రామ మాజీ సర్పంచ్ నల్ల మహిపాల్‌రెడ్డి అన్నారు. మూడు రోజులుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పంట పొలాలకు సాగునీరందడంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వారం రోజుల నుంచి ఎండల తీవ్రత పెరిగిందని, ఈ కారణంగా పంటలకు నిరంతర సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మానాలలో పల్లె పల్లెకూ కాంగ్రెస్ జెండా

మల్యాల: పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని మానాల గ్రామంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో దొంగ ఆనంద రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, శనిగరపు తిరుపతి, మరాటి బుచ్చిరెడ్డి, ఎడిపెల్లి మల్లయ్య, శంకర్ గౌడ్, శ్రావణ్, గంగారాం పాల్గొన్నారు.


కాంగ్రెస్ జెండా కార్యక్రమంలో పార్టీ నాయకులు

క్లుప్తంగా

అక్షర వనం సందర్శించిన ఉపాధ్యాయులు


అక్షరవనం వద్ద హెచ్‌ఎంలు, టీచర్లు

కథలాపూర్: కథలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లాలోని అక్షర వనంను సందర్శించారు. ప్రాథమిక విద్యాబోధన అభ్యాసనాన్ని, కొత్త మెలకువలు విద్యార్థులకు అందించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లాలోని అక్షర వనంకు వెళ్లినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ఆధునిక బోధన పద్ధతులపై దృష్టిసారించామని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం అర్జున్, హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారావు, పరమేశ్వర్, రవి, సుధాకర్, బాలకిషన్, శేఖర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన


ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

మేడిపల్లి: మండలంలోని కాచారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఇళ్లను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. ఎవరైతే మొదటగా ఇంటి నిర్మాణం పూర్తి చేస్తారో మొదటి ముగ్గురిని గుర్తించి నగదు ప్రోత్సకాలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, ప్రదాన కార్యదర్శి చేపూరి నాగరాజు, ఎస్సీసెల్ అధ్యక్షుడు మేదరి లాజర్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ఐ చర్చిలో వనమహోత్సవం


మొక్కలు నాటుతున్న జీవరత్నం దంపతులు

జగిత్యాలటౌన్: పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌లో గల సీఎస్‌ఐ వెస్లీ చర్చి ఆవరణలో ఆదివారం ఆరాధన అనంతరం వనమహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జీవరత్నం దంపతులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు తలా ఓ మొక్క నాటి వనమహోత్సవ ఆవశ్యకతను చాటారు. జీవరత్నం మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల కలిగే పర్యావరణ పరిరక్షణ దాని ప్రాముఖ్యతను వివరించారు. నాటిన ప్రతి మొక్క సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో క్రైస్తవులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత


ప్రొసీడింగ్ కాపీని అందిస్తున్న నవీన్

మెట్‌పల్లి: పట్టణంలోని 14వార్డులో గంగపుత్ర సంఘ భవన నిర్మాణానికి ఎంపీ అర్వింద్ రూ.3లక్షలను మంజూరు చేసినట్లు బీజేవైయం రాష్ట్ర నాయకుడు దొనికెల నవీన్ తెలిపారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని ఆదివారం ఆయన సంఘ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఆర్మూర్ రాజేశ్, నరేందర్, సుంకేట విజయ్, రాజేందర్, లోలపు అనిల్, సురేష్, గంగాధర్ తదితరులున్నారు.

వర్షాకాలంలోనూ బావుల పూడికతీత



వెల్గటూర్ : వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా ఇప్పటికీ వరుణుడు కరుణించక తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో వరి నాట్లు వేసుకునే రైతులు సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటల సాగుకోసం నీరు సరిపోక వెల్గటూర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ఓ రైతు వర్షాకాలంలో కూడా ఎక్స్‌వేటర్‌తో తన వ్యవసాయ బావికి పూడిక తీస్తున్నాడు. ఈ సన్నివేశం చూసిన కొందరు స్థానికులు రైతులకు ఎంతటి దుస్థితి వచ్చిందని చర్చించుకోవడం విశేషం.



ధర్మపురి: పట్టణంలోని 3వ, వార్డులోని శ్రీ సాయి శివబాలాజీ మందిరానికి వెళ్లే రహదారి ఇరువైపులా శిథిలమై ప్రమాదకరంగా మారింది. డ్రైయినేజీ శిథిలం కావడంతో నీరు పొంగి పొర్లి దుర్గంధం వెదజల్లుతోంది. గోదావరి, దేవాలయానికి భక్తులు ఈ రహదారి గుండా వెళ్తుంటారు. కాలి నడకన, వాహనాల ద్వారా వచ్చే భక్తులకు ఈ నీరు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. డ్రైయినేజీలో పూడిక తీత లేక చెత్త నిండి ఉండడంతో ఆ నీరంతా బయటకు చేరి రహదారి గుండా వెళ్తుంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, కమిషనర్, ధర్మపురి బల్దియా, సెల్ నంబర్ : 6304101019

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

స్తంభం తొలగించారు..

కోరుట్లటౌన్: ఒకటి, రెండేళ్లు కాదు ఏకంగా 65 ఏళ్లుగా ఆ విద్యుత్ స్తంభం నడిరోడ్డుపై ఉంది. 75 ఏళ్ల క్రితం కోరుట్ల విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన పని చేయకుండా ఉన్న 33 కేవీ లైన్ కావడంతో ఆ స్తంభాన్ని తొలగించడం వీలు కాలేదు. సుమారు 50 ఏళ్లుగా పని చేయకుండా రోడ్డు మధ్యలో వృథాగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు విద్యుత్ అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం ఈ స్తంభం సమీపంలో విద్యుత్ వైర్లు తగిలి ఇద్దరు బాలురు గాయపడ్డారు. ఆ సమయంలోనూ స్తంభం తొలగించాలని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కోరుట్ల టౌన్ ఏడీఈ రఘుపతి ఉన్నతాధికారులకు సమస్య నివేదించగా, ఆదివారం ఆ విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. దీంతో స్థానికులు 65 ఏళ్లు రోడ్డు మధ్యలో ఉన్న పోల్ సమస్యతో పాటు 33 కేవీ వైర్ల షాక్ ప్రమాదం తప్పిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

స్వర్ణకార సంఘం కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న స్వర్ణకారుల సంఘం నాయకులు

జగిత్యాలటౌన్: జిల్లాలోని స్వర్ణకారులందరూ ఏకతాటిపైకి వచ్చి సంఘం ఐక్యతను చాటాలని స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇల్లెందుల రాజు, ప్రధాన కార్యదర్శి గాలిపెల్లి గంగాప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో స్వర్ణకార సభ్యత్వ నమోదు పోస్టర్‌ను ఆదివారం సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇల్లెందుల రాజు మాట్లాడుతూ 9 ఏళ్ల క్రితం జరిగిన స్వర్ణకార సంఘం ఎన్నికల్లో 2058 ఓట్లుండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 424కు పడిపోయిందన్నారు. ఈ తొమ్మిదేళ్లలో సంఘం అభివృద్ధికి పాటుపడిన 1634మంది సభ్యులు తమ విలువైన ఓటు హక్కును కోల్పోయారని అన్నారు. సంఘం అభివృద్ధి కోసం సేవచేసిన పెద్దలను మరిచిపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొందుకూరి ఆగయ్య, సహాయ కార్యదర్శి భూమాచారి, కోశాధికారి బెజ్జారపు శ్రీధర్, కార్యవర్గ సభ్యులు కట్ట నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కారుపై పడిన చెట్టు కొమ్మ

మల్యాల: మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో చెట్ల కొమ్మలు కొట్టేస్తుండగా రోడ్డుపై వెళ్తున్న కారుపై పడడంతో కారు దెబ్బతిన్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చెట్ల కొమ్మలను కొందరు వ్యక్తులు తొలగిస్తుండగా, చెట్ల కొమ్మలు రోడ్డుపై పడడంతో రోడ్డు వెంట వెళ్తున్న ఓ డాక్టర్ కారుపై పడి దెబ్బతిన్నది. దీంతో కొద్దిసేపు రోడ్డు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రైవేట్ వ్యక్తులు ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేస్తున్నారు.

వర్షాలు కురువాలని కప్పతల్లి ఆట

కొడిమ్యాల: మండలంలోని హిమ్మత్‌రావు పేటలో వర్షాలు కురవాలని గ్రామంలోని యువకులు పెద్దలు కలిసి ఇంటింటికీ వెళ్లి కప్పతల్లి ఆట ఆడారు. వరుణ దేవుణ్ణి వేడుకుంటూ వర్షాలు కురవాలని ప్రార్థించారు.

అవినీతి అధికారుల ఆస్తులు జప్తు చేయాలి

కరీంనగర్: రాష్ట్రంలో ప్రాజెక్టుల అవినీతికి పాల్పడిన మాజీ సీఎం కేసీఆర్ ఆస్తులతో పాటు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల ఆస్తులను జప్తు చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన నుంచి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న అధికారులు అవినీతికి పాల్పడ్డారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విచారణకు సంబంధించిన వివరాలు ప్రజలకు తెలిసేలా జిల్లాలో కలెక్టరేట్ ఎదుట అవినీతి అధికారుల ఫొటోలు పెట్టి, ఆస్తులు జప్తు చేసి నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆర్‌పీఐ నాయకులు శ్రీనివాస్, మీరియా, అజయ్, లలిత, ఎల్లయ్య, కొమురయ్య, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.